నమస్తే తెలంగాణ
వికారాబాద్
15 హైదరాబాద్, శనివారం 10 ఫిబ్రవరి 2024 VIKARABAD



దామగుండం అడవిలో భూ రికార్డుల ప్రకారం హద్దుల సర్వే చేస్తున్న అధికారులు

# దామగుండం ఫారెస్ట్ సరిహద్దుల సర్వే

## ప్రజల వినతులను బేఖాతరు చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

పూడూరు, ఫిబ్రవరి 8: నేవీ రాడార్ సిగ్నల్ సెంటర్ ఏర్పాటుపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే అందమైన ప్రకృతి దెబ్బతినే అవకాశం ఉన్నది. అంతేకాకుండా ఇక్కడ లక్షల్లో ఉన్న ఆయుర్వేద మొక్కలు, జంతువులు, పక్షుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పలువురు మేధావులు, శాస్త్రవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ సిగ్నల్ సెంటర్ ఏర్పాటు వద్దంటూ అటవీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 'ప్రకృతి విధ్వంసం పరిరక్షణ కమిటీ'ని ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే రేడియేషన్ ప్రభావంతో ఈ ప్రాంతంలో నివసించే ప్రజలకు అనేక రోగాలబారిన పడుతారని పలు శాఖల ఉన్నతాధికారులకు ఎన్నోమార్లు వినతి పత్రాలను సమర్పించినా పట్టించుకోవడం లేదన్నారు. గతంలో నేవీ అధికారులు దామగుండం అడవి భూమిని స్వాధీనం చేసుకునేందుకు అప్పటి ప్రభుత్వాన్ని కోరితే.. స్థానికుల వినతి మేరకు అనుమతులు ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు గడవక ముందే అనుమతులతో పాటు నేవీ అధికారులకు అవసరమైన పత్రాలను సైతం అందజేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూడూరు మండలంలోని పలు గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాలు, శాస్త్రవేత్తలు రాడార్ కేంద్ర ఏర్పాటు వద్దంటూ నినాదిస్తున్నారు.

### ఫారెస్ట్ హద్దుల సర్వే..

దామగుండం ఫారెస్ట్, రెవెన్యూ భూముల సరిహద్దులను శుక్రవారం సర్వే నిర్వహించారు. ప్రభుత్వం దామగుండం దేవాలయానికి చెందిన సుమారుగా 38 ఎకరాలకు పైగా భూమితో పాటు ఫారెస్ట్‌కు చెందిన 2,900 ఎకరాల భూమిని నేవీ శాఖకు అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో నేవీ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు కలిసి భూ సర్వే నిర్వహిస్తున్నారు. ఫారెస్ట్ సరిహద్దులతో పాటు దేవాలయ భూమి సరిహద్దులను సర్వే చేస్తున్నారు. గతంలో టేకులబీడుతండా ప్రాంతం భూమిలోని మట్టి నమూనా సేకరించారు. నేవీ అధికారులు ఈ భూమి ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రస్తుతం రికార్డుల్లో ఉన్న సరిహద్దులు చూసుకుంటున్నారు.

# మన పీవీ.. భారతరత్న



భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు 'భారతరత్న' దక్కడం పట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. పీవీకీ దేశ అత్యున్నత పురస్కారం రావడం యావత్ తెలంగాణకు గర్వకారణమన్నారు.



# కోమటిరెడ్డి VS మల్‌రెడ్డి



## ఆదిబట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ లో కోల్డ్ వార్

### కొత్త ఆర్తికకు మల్‌రెడ్డి.. మర్రి నిరంజన్‌కు కోమటిరెడ్డి మద్దతు

### ఎట్టకేలకు ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పై నెగ్గిన అవిశ్వాసం..

ఆదిబట్ల, ఫిబ్రవరి 9: ఎట్టకేలకు ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక.. వైస్ చైర్‌పర్సన్ కళమ్మపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. గత నెల రోజులుగా ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు, బీజేపీకి చెందిన ఒకరు, బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు మొత్తం 13 మంది తీర్మానం చేసి రంగారెడ్డి కలెక్టర్‌కు ఆ కాపీని అందించారు. దీంతో కలెక్టర్ ఈ నెల 9న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించి 15 మంది కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10-30 గంటలకు చైర్‌పర్సన్‌పై.. 12 గంటలకు వైస్ చైర్‌పర్సన్‌పై ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి నేతృత్వంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక, వైస్ చైర్‌పర్సన్ కళమ్మపై అవిశ్వాసం పెట్టేందుకు 13మంది కౌన్సిలర్లు ఆమోదం తెలపడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. చైర్‌పర్సన్ వైస్‌చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం కాపీలపై సభ్యులు సంతకాలు చేసి ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి అందజేశారు. అప్పటికే చైర్‌పర్సన్ సమావేశ మందిరం నుంచి బయటికెళ్తూ నాలుగేండ్ల కాలంలో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని కంటతడి పెట్టారు. వైస్ చైర్‌పర్సన్ మాత్రం ఈ సమావేశానికి హాజరుకాలేదు. ఈ సందర్భంగా ఆర్డీవో అనంతరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక తేదీని ప్రభుత్వం ప్రకటిస్తుందని.. అప్పటివరకు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలు నిర్వహిస్తారన్నారు.





చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసంలో నెగ్గి బయటికి వచ్చిన కౌన్సిలర్లు



ఆవేదనతో సమావేశ మందిరం నుంచి బయటికి వెళ్తున్న చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక

### నిరంజన్‌రెడ్డికి కోమటిరెడ్డి అండ..

అవిశ్వాసం పెట్టేందుకు 13మంది కౌన్సిలర్లు ఆమోదం తెలపడంతో ఆదిబట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీలో కోల్డ్‌వార్ కొనసాగింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్సెస్ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు రెండు గ్రూపులుగా విడిపోయారు. మంత్రి కోమటిరెడ్డి మర్రి నిరంజన్‌రెడ్డికి అండగా ఉండగా.. మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తికకు సపోర్టు చేశారు. కాగా మర్రి నిరంజన్‌రెడ్డి ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశించి కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు, బీజేపీకి చెందిన ఒకరు, బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు మొత్తం 13 మందితో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసానికి తెరలేపారు. కలెక్టర్‌కు అవిశ్వాసం పెట్టాలని తీర్మాన కాపీని అందించి తనకు మద్దతుగా ఉన్న 12 మంది కౌన్సిలర్లను క్యాంపులకు తరలించారు. సొంత పార్టీకి చెందిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లపై నిరంజన్‌రెడ్డి అవిశ్వాసాన్ని పెట్టించినందుకు కాంగ్రెస్ పార్టీ సీరియస్‌గా తీసుకున్నది. షోకాజ్ నోటీస్ జారీ చేసినా స్పందించకపోవడంతో నాలుగు రోజుల క్రితం అతడిని పార్టీని నుంచి సస్పెండ్ చేసింది. కాగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మర్రి నిరంజన్‌రెడ్డి అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గి తన పంతాన్ని నిలబెట్టుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా పోలీసులు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్ రావు, ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

### స్వల్ప ఉద్రిక్తత..

ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం బల పరీక్షకు హాజరైన సభ్యులు మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లగానే చైర్‌పర్సన్ ఆర్తిక తన వర్గంతో ఒక్కసారిగా ఆ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించింది. దీంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పాల్సి వచ్చింది. కాసేపు మున్సిపాలిటీ ఎదుట స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకున్నది. పోలీసులు వారిని వాహనాల్లో పీఎస్‌కు తరలించారు.



మల్‌రెడ్డి రంగారెడ్డి వర్గీయులపై లాఠీచార్జి చేసి చెదరకొడుతున్న పోలీసులు

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

## కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల ధర్నా

వికారాబాద్, ఫిబ్రవరి 9 : ఆశ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించడంతోపాటు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నెలకు రూ.24 వేల జీతం ఇవ్వాలని బీఆర్‌టీ యూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆశ వర్కర్ల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇస్తున్న రూ.9900లను సైతం నెలనెలా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద బీమా రూ.5లక్షలు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు సైతం కల్పించాలన్నారు. ఈ నెల 16న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 16 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డికి అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రన్న, బీఆర్‌టీయూ జిల్లా నాయకులు కృష్ణ, తెలంగాణ గ్రామీణ ఆరోగ్య ఆశ కార్మికుల సంఘం (బీఆర్‌టీయూ అనుబంధం) జిల్లా కార్యదర్శి అనిత, జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి, నర్సమ్మ, జిల్లా నాయకురాలు మంగమ్మ, అమృత, ఉర్మిళ పాల్గొన్నారు.




# చెల్లని చెక్కు!

## గడువు ముగిసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

- లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- బ్యాంకుల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు
- విషయం బయటికి పొక్కడంతో చెక్కులను వెనక్కితీసుకున్న అధికారులు
- రెవెన్యూ అధికారుల అలసత్వంతో లబ్ధిదారులకు పాట్లు



తహసీల్దార్ కార్యాలయం గోడపై అతికించిన లబ్ధిదారుల జాబితా



పెద్దేముల్ : తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

పెద్దేముల్, ఫిబ్రవరి 9 : అధికారుల నిర్లక్ష్యంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఎప్పుడో అందించాల్సిన చెక్కులు సకాలంలో ఇవ్వకపోవడంతో వాటి కాలపరిమితి దాటిపోయింది. వాటినే లబ్ధిదారులకు పంపిణీ చేయడంతో చెక్కులు అందుకున్న ఆయా గ్రామాల లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్న సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 6వ తేదీ మండల రెవెన్యూ అధికారులు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితోపాటు పలువురు మండల ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. ఇదిలా ఉండగా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు కలిసి ఆయా గ్రామాల్లోని కొంత మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి వెళ్లిపోయారు. మిగిలినవాటిని గ్రామాలవారీగా అధికారులు పంపిణీ చేశారు. మండలానికి మొత్తం 122 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరయ్యాయి. అందులో సుమారు 17 చెక్కులు కాల పరిమితి దాటిపోయి ఉండగా, అధికారులు వాటిని గుడ్డిగా చూసుకోకుండా హడావుడిగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అధికారులు చేసిన తప్పిదంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెక్కులను లబ్ధిదారులు బ్యాంకుల్లోని తమ ఖాతాల్లో జమ చేయడానికి తీసుకెళ్లగా చెక్కుల కాల పరిమితి దాటిపోయిందని అధికారులు వారికి చెప్పడంతో అవాక్కయ్యారు. అయితే విషయం బయటకు రావడంతో రెవెన్యూ సిబ్బంది తక్షణమే లబ్ధిదారులను పిలిపించుకొని కొంత మంది చెక్కులను తేదీల మార్పు కోసం వెనక్కి తీసుకొన్నారు. ఈ చెక్కులను ఆర్డీవో కార్యాలయానికి పంపినట్లు తెలుస్తున్నది. కనీసం తేదీలను కూడా చూసుకోకుండా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయడం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా తహసీల్దార్ సిబ్బంది ఉదాసీనతగా వ్యవహరించడంతోనే జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై మండల డిప్యూటీ తహసీల్దార్ మహేశ్‌ను వివరణ కోరగా కాల పరిమితి దాటిపోయిన చెక్కుల స్థానంలో వేరే చెక్కులను త్వరలో అందజేస్తామని, లబ్ధిదారులకు తగిన న్యాయం చేస్తామన్నారు. ఏది ఏమైనా కార్యాలయంలో పలువురు ఉద్యోగులు ఉండి కూడా తేదీలను చూసుకోకుండా లబ్ధిదారులకు ఇవ్వడం ఏమిటని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

# సాయం.. ఆలస్యం అప్పు.. నిర్లక్ష్యం

- అదును దాటుతున్నా అందని రైతుబంధు సాయం
- పంట రుణాలు అరకొర
- అప్పు పుట్టక అన్నదాతలు ఆగమాగం..
- ఈ ఆర్థిక సంవత్సరం రూ.3,082 కోట్లకుగాను రూ.1,786 కోట్ల రుణాల చెల్లింపు
- యాసంగిలో 1,532 కోట్ల రుణాలకుగాను రూ.561 కోట్ల రుణాలే మంజూరు
- మూడు ఎకరాల వరకే జమ అయిన రైతుబంధు సాయం





వికారాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): అన్నదాతలకు సాగు కష్టాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో అందిన పెట్టుబడి సాయంతో అప్పుల కోసం ఎదురుచూడకుండా విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసి పంటలను ఉత్సాహంగా సాగు చేసుకోగా.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అదును దాటుతున్నా సాయం అందకపోవడంతోపాటు మరోవైపు అప్పులు దొరకక కష్టాలు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు సాయాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేయగా అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. కాంగ్రెస్ హామీనిచ్చిన రైతుభరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ప్రారంభించకపోగా.. రైతుబంధు సాయం నిమి త్తం ఉన్న నిధులను కూడా బ్యాంకు ఖాతాల్లో జమ చేయకపోవడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుబంధు సాయాన్ని జిల్లాలోని మూడు ఎకరాలు ఉన్న రైతులకు మాత్రమే ఇప్పటివరకు అందించారు. జిల్లా వ్యాప్తంగా 2,95,796 మంది రైతులుండగా 2,00,567 రైతుల కు రైతుబంధు సాయాన్ని జమ చేశారు. మరో 95వేల మంది రైతులకు అందాల్సి ఉన్నది. యాసంగి సీజన్ రైతుబంధు కింద రూ.322 కోట్లకుగాను రూ.135 కోట్లను పంపిణీ చేశారు. ఈ యా సంగికి రైతుబంధు సాయం అందకపోగా.. బ్యాంకర్లు పంట రుణాలను మంజూరు చేయకపోవడంతో అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది.

### రైతులకు అరకొర రుణాలే..

ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులకు బ్యాంకర్లు అరకొర రుణాలనే మంజూరు చేశారు. నిర్దేశించిన లక్ష్యంలో 35శాతం మేర అందించాయి. ఈ ఏడాది వానకాలం, యాసంగి సీజన్‌లకుగాను రూ. 3,082 కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటివరకు రూ.1,786 కోట్ల రుణాలను మా త్రమే బ్యాంకు అధికారులు రైతులకు అందించారు. వానకాలంలో రూ.1,550 కోట్ల రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని రూ.1,225 కోట్లు, యాసంగి సీజన్‌లో రూ.1,532 కోట్ల రుణాలకు గాను ఇప్పటివరకు రూ.561 కోట్ల రుణాలను మాత్రమే మంజూరు చేశారు. యాసంగి సీజన్ దాటిపోతున్నా రైతులకు పంట రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం ప్రభుత్వం బ్యాంకర్లను పట్టించుకోకపోవడంతో పంట రుణాలివ్వడంతో నిర్లక్ష్యం చేస్తున్నారు. మరోవైపు రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో అప్పులు మాఫీ అవుతాయని ఎదురుచూస్తున్న రైతులను బ్యాంకర్లు ఇబ్బందిపెడుతున్నారు. వారం రోజుల క్రితం వికారాబాద్ నియోజకవర్గంలో రూ.2 లక్షల పంట రుణాలకు సంబంధించి ఓ రైతు ఇంటికెళ్లిన బ్యాంకర్లు దౌర్జన్యం చేసి ఇంట్లోని టీవీ, ఫ్రిజ్‌ను తీసుకెళ్లినట్లు తెలిసింది. బ్యాంకర్లు అప్పులు తీర్చాలని రైతులను ఇబ్బందులు పెడుతున్నారు.

### బీఆర్ఎస్ హయాంలో రూ.2,622 కోట్ల పెట్టుబడి సాయం..

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకంతో పెట్టుబడి సాయాన్ని అందించి రైతులను అప్పుల బారి నుంచి ఆదుకున్నది. ప్రభుత్వం ప్రతిఏటా ఎకరాకు రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించడంతో అన్నదాతలకు పంట రుణాల కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన తిప్పలు తప్పాయి. రైతుబంధు పథకం కింద బీఆర్ఎస్ ప్రభుత్వం వికారాబాద్ జిల్లాకు రూ.2,622 కోట్ల సాయాన్ని అందజేసింది. 2018 వానకాలం సీజన్‌లో 1,94,833 మంది రైతులకు రూ.221 కోట్లు, యాసంగిలో 1,75,989 మంది రైతులకు రూ.206 కోట్లు, 2019 వానకాలంలో 1,78,998మందికి రూ.255 కోట్లు, యాసంగి సీజన్‌లో 1,71,824 మందికి రూ.194 కోట్లు, 2020 వానకాలంలో 2,113,341 మందికి రూ.297 కోట్లు, యాసంగిలో 2,19,264 మందికి రూ.301 కోట్లు, 2021 వానకాలంలో 2,25,438 మందికి రూ.300 కోట్లు, యాసంగిలో 2,24,928 మందికి రూ.241 కోట్లు, 2022-23 వానకాలంలో 2,47,707 మందికి రూ. 305 కోట్లు, యాసంగిలో 2,43,447 మంది రైతులకు రూ.299 కోట్ల పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.5 వేల చొప్పున నేరుగా ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది.